ఏఎంసీలో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి తీర్మానం

ఏఎంసీ చైర్మన్ రసూల్ బీబీ

ఆకివీడు: ఆకివీడు మార్కెట్ కమిటీ పరిధిలో చేపల, రొయ్యల చెరువులు అధికంగా ఉండడంతో కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి ఏకగ్రీవంగా తీర్మానించామని ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ చెప్పారు. ఏఎంసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన కమిటీ ప్రథమ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. గత కొన్నేళ్లుగా రొయ్యల రైతులు విజ్ఞప్తుల మేరకు యార్డు ఖాళీ స్థలంలో స్టోరేజ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. మార్కెట్ యార్డులో పురాతనమైన షెడ్లు పాడైపోయాయని, యార్డు ప్రాంతం లోతట్టుగా ఉండటంతో వర్షపు నీటికి నిలిపోతుందని చెప్పారు. ఈ


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రసూల్ బీబీ

సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు కృషి చేయాలని కోరామన్నారు. వరి రైతులకు అనుకూలంగా యార్డు ప్రాంగణం అభివృద్ధికి సహకరించాలని రసూల్ బీబీ విజ్ఞప్తి చేశారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి మాట్లాడుతూ మార్కెట్ యార్డు పరిధిలో ఆదాయం వృద్ధి చెందే విధంగా నూతన కమిటీ కృషి చేయాలన్నారు. రైతులకు అవసరమైన పనులు చేపట్టే విధంగా ప్రభుత్వానికి తీర్మానాలు చేసి పంపాలని సూచించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ నూతన కమిటీ రైతులకు మెరుగైన సేవలందించాలని కోరారు. ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులకు విశిష్ట సేవలందిస్తోందని చెప్పారు. సమావేశంలో వైస్‌చైర్మన్ గంటా ఆనందరావు, డైరెక్టర్లు మంతెన లక్ష్మీ సూర్యకుమారి, పడమట సబ్బయ్య, నిమ్మల వెంకటరత్నం, బొండాడ జోష్ మేరి, ఊడిగ లక్ష్మి, మెంటే మరియమ్మ, బొక్కా శ్రీనివాస్, శలా సుబ్బలక్ష్మి, జెట్ల దివ్య, సంగాని కనకలక్ష్మి, మంతెన సీతారామరాజు, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కిషోర్‌రెడ్డికి అభినందనలు


పడాల సాయి రత్న కిషోర్‌రెడ్డి

ఆకివీడు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ విభాగ కమిటీ జనరల్ సెక్రటరీగా నియమితులైన ఆకివీడుకు చెందిన పడాల సాయి రత్న కిషోర్‌రెడ్డిని బుధవారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కమిటీలో తనకు స్థానం కల్పించారని చెప్పారు. ఈ ప్రాంతంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ మిధున్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దాడిశెట్టి రాజాకి కృతజ్ఞతలు తెలిపారు.

మండల స్థాయి క్రీడా పోటీలు


సిద్ధాపురంలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

ఆకివీడు: పల్లె నుండే ప్రపంచ స్థాయికి ఎదిగిన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారని ఎంఈఓ–2 సీతారామయ్య అన్నారు. మండల క్రీడా పోటీల్ని బుధవారం సిద్ధాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. పోటీల్లో 150 మంది బాలురు, 100 మంది బాలికలు వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్నారు. విజేతలను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపుతామని మండల క్రీడా కోఆర్డినేటర్ జి.మోహన్ చెప్పారు. పోటీల ప్రారంభోత్సవంలో సర్పంచ్ చిట్టిబాబు, ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం


మాట్లాడుతున్న జాన్సన్

ఉండి: ప్రజా సంక్షేమానికి పాటుపడుతోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుద్దామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిష్టియన్ మైనారిటీ అధ్యక్షుడు మేడిద జాన్సన్ అన్నారు. బుధవారం ఉండి మండలం పాములపర్రులో పాస్టర్ సువర్ణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సేవకుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ మండలాధ్యక్షుడు దేవ వరదానం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జాన్సన్ మాట్లాడుతూ క్రైస్తవులంతా ఐకమత్యంతో ముందుకుసాగాలన్నారు. క్రిష్టియన్ మైనారిటీలు, ఎస్సీలందరికీ రాజకీయంగా, సామాజికంగా అండదండలు అందిస్తూ ప్రత్యేక కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో నడిపిస్తోన్న గొప్ప నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. గతంలో మనల్ని తక్కువ చేసి మాట్లాడిన కొందరు ఇప్పుడు ఓట్లు దండుకోవడానికి ఊసరవల్లి మాదిరి వచ్చి చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మొద్దని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్షేమం కోరుతూ దేవునికి ప్రార్థనలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూపీఏ నాయకులు ఈలి డేవిడ్‌మార్క్, మార్టిన్‌లూథర్, గొల్లా దానియేలు, ఎలీషా, నీతిపూడి యోహాను తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ శ్రీను

సాక్షి, భీమవరం: వినాయక చవితి ఉత్సవాల్లో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని వన్ టౌన్ సీఐ అడబాల శ్రీను అన్నారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు పోలీసు, మునిసిపల్ అధికారుల అనుమతులు తప్పనిసరన్నారు. ఉత్సవాలకు మట్టి విగ్రహాలనే వినియోగించాలని, దొంగతనాలు, అగ్నిప్రమాదాలు వంటివి జరగకుండా ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా డీజే సౌండ్స్, నిమజ్జనం సమయంలో డ్యాన్స్‌లు మంచిదికాదని అన్నారు. రాజకీయాలు, కుల, మతాలకు అతీతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు.

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా బుధవారం రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో జరిగిన ఈ హోమంలో 49 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

24 మందికి స్థల పట్టాల పంపిణీ


కోళ్లపర్రు పట్టాలు అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకట్రాజు

ఆకివీడు: మండలంలోని కోళ్లపర్రు గ్రామంలో తాళ్లకోడులో స్థలం కేటాయించి పట్టాలు ఇస్తున్నట్టు జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను) తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులు 24 మందికి బుధవారం ఆయన పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వెంకట్రాజు మాట్లాడుతూ కోళ్లపర్రులోని ప్రభుత్వ స్థలంలో పట్టాలు నిరుపేదలకు మూడేళ్ల క్రితం అందజేశామన్నారు. ఆ స్థలంను ఆక్రమించుకుని పట్టాలు ఇవ్వనివ్వకుండా టీడీపీకి చెందినవారు కోర్టుకెళ్లారని చెప్పారు. బాధితులు ఇబ్బందులు పడుతున్నందున కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల్లో స్థలం కేటాయించి, పట్టాలు అందజేస్తున్నట్టు తెలిపారు. త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళి మాట్లాడుతూ పేదలకు పట్టాలు ఇవ్వనివ్వకుండా టీడీపీ మండలంలో పలుచోట్ల అభ్యంతరాలు వ్యక్తంచేస్తూ కోర్టులకు వెళ్లిన ఘటనలున్నాయన్నారు. బాధితులకు అండగా వైఎస్సా ర్‌సీపీ నిలబడి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కఠారి జయలక్ష్మి, కోళ్లపర్రు గ్రామ పార్టీ నాయకులు పాశం నర్సింహరాజు, దింటకుర్తి నాగేశ్వరరావు, కేశిరెడ్డి దిలీప్, కేశిరెడ్డి వాసు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షఫ్రక్, తహసీల్దార్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా సీఎం జగన్

భీమవరం అర్బన్: నిరాధరణకు గురవుతోన్న వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు, డయాలసిస్ బాధితులకు, ఆపదలో ఉన్నవారికి పింఛన్ ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు అల్లూరి కృష్ణంరాజు అన్నారు. భీమవరం మండలం వెంప గ్రామంలో బుధవారం ఆయన కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో నూతనంగా పింఛన్ కోసం మండలాఫీసులు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా వచ్చేవి కావన్నారు. సీఎం జగనన్న ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తోందని చెప్పారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అర్హులందరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ సారథ్యంలో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు సానబోయిన సత్యనారాయణ, సర్పంచ్ ఇంజేటి రాజేశ్వరి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ కలిదిండి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


వెంపలో కొత్త పింఛన్లు అందిస్తున్న పార్టీ సీనియర్ నాయకుడు కృష్ణంరాజు

● మండలంలో లోసరి, ఎల్‌వీఎన్ పురం, రాయలం, చినఅమిరం, గొల్లవానితిప్ప, దిరుసుమర్రు తదితర గ్రామాలలో నూతనంగా మంజూరైన పింఛన్లను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పాలకసభ్యులు అందజేశారు.

ప్రజల ఆరోగ్యమే జగన్‌కు ముఖ్యం

కాళ్ల: ప్రజలను ఆరోగ్యంగా ఉంచటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య ఉద్దేశమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాట్లాడారు. పేద వర్గాల వారు ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో సీఎం జగన్ ఈనెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈనెల 15 నుంచి వైద్య సిబ్బంది ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకొని, వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఈ నెల 30 తరువాత వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బందా విజయ, ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీటీసీ సత్యవతి, వీరమల్లు బోసు, గుండా సాయి, గంటా బాలు, వడ్డికాసులు అబ్బులు, మహంకాళి, ముఖేష్, డాక్టర్లు సునీల్, గులాబ్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమమలో మాట్లాడుతున్న పీవీఎల్

లంకలకోడేరు జెడ్పీ స్కూల్ సందర్శన

పాలకొల్లు అర్బన్: జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు నూరుశాతం మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రజా పంపిణీ నిర్వహణ నోడల్ అధికారి ఉపేంద్ర సింగ్ కోరారు. లంకలకోడేరు జెడ్పీ ఉన్నత పాఠశాలను బృందం బుధవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బియ్యం, గుడ్లు, చిక్కీలు, రాగి పిండి, బెల్లం పొడి నిల్వలు పరిశీలించారు. వాటి నాణ్యతను కూడా పరీక్షించారు. మధ్యాహ్న భోజన మెనూ పరిశీలించారు. వంటల తయారు చేస్తున్న విధానం పరిశీలించి ఏజెన్సీ నిర్వాహకులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ సిలిండర్లను సబ్సిడీ ధరలకు అందించాలని ఏజెన్సీ నిర్వాహకులు కేంద్ర బృందం సభ్యులకు తెలియజేశారు. 95 శాతం విద్యార్థులు పాఠశాలలోనే భోజనం చేయడం పట్ల బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన, పాఠశాల పారిశుధ్య జిల్లా సమన్వయకర్తలు కె కృష్ణారావు, జి చిన్నయ్య, ఎంఈఓ గుమ్మళ్ల వీరాస్వామి, హెచ్‌ఎం జీబీజే ప్రసాదరావు, సహోపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.


హైస్కూల్‌ను సందర్శిస్తున్న కేంద్ర బృందం

వైభవంగా మాసశివరాత్రి పూజలు


పుష్పాలకరణలో మార్కండేయేశ్వరస్వామి


దర్మాపుర అగ్రహారంలో అన్నాభిషేకం చేసి హారతి ఇస్తున్న దృశ్యం

ఆకివీడు: శ్రావణమాస మాసశివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆలయాల్లో భోళాశంకరుడికి అభిషేకాలు నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి, ధర్మాపుర అగ్రహారం పురాతన శివలింగం, పిల్లలమర్రి అగ్రహారం వేంకట లింగేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, అయిభీమవరం మదనగోపాలస్వామి ఆలయాలతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, అన్నసమారాధనలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులకు ప్రసాదవితరణ చేశారు.

పేటీఎం ద్వారా రుణ వాయిదాలు చెల్లించండి

ఉండి: స్త్రీనిధి మహిళా బ్యాంక్ ప్రారంభించిన పేటీఎం పద్ధతి ద్వారా రుణ వాయిదాలు చెల్లించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం ఉండిలో నిర్వహించిన సమావేశంలో డ్వాక్రా వీవోఏలకు పేటీఎం మెషీన్‌ను ఆయన అందజేశారు. స్త్రీనిధి రుణ వాయిదాలు పేటీఎం ద్వారా చెల్లించాలన్నారు. ఈ విధానాన్ని జిల్లాలో మొట్టమొదటిగా ఉండి మండలంలో ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. డెబిట్, క్రెడిట్ కార్డు, ఫోన్ పే, గూగుల్ పే క్యూ ఆర్ కోడ్ స్కాన్ ద్వారా కూడా వాయిదాలు చెల్లించవచ్చన్నారు. ఈ విధానం వల్ల నగదు లావాదేవీల్లో అవకతవకలకు అవకాశం ఉండదని తెలిపారు. వెంటనే రసీదు కూడా పొందవచ్చన్నారు. ఉండి మండలంలో 42 గ్రామ సమాఖ్యల్లో 544 స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.14.86 కోట్లు రుణాలు ఇవ్వగా రూ.6.32 కోట్ల నిల్వ ఉందని చెప్పారు. అక్టోబరు నెల నుంచి ఈ పద్ధతిలో వాయిదాలు చెల్లించాలని అన్నారు. అనంతరం జిల్లాలోని అత్తిలి, ఆచంట మండలాల్లో అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం పి.శశికుమార్, స్త్రీనిధి మేనేజర్ పి.శ్రీరామ్, ఏపీఎం జి.శేషవేణి, సీసీలు రాంబాబు, రామలక్ష్మి, కన్యాకుమారి, వీవోఏలు పాల్గొన్నారు.


ఉండిలో డ్వాక్రా వీవోఏలకు పేటీఎం మెషీన్ అందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

పెనుమంట్ర: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈ నెల 30 నుంచి అక్టోబరు 18 వరకు గ్రామాల్లో జరుగుతుందని పెనుమంట్ర ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో షెడ్యూల్‌ను విడుదల చేసారు. ఈనెల 30న నెగ్గిపూడి, అక్టోబరు 3న ఆలమూరు, 4న నత్తారామేశ్వరం, 5న మార్టేరు–2లో, 6న పెనుమంట్ర–2లో, 7న జుత్తిగ, 9న నెలమూరు. 10న ఓడూరు, 11న మల్లిపూడి, 12న వెలగలవారిపాలెం, 13న సోమరాజు ఇల్లిందలపర్రు, 16న సత్యవరం, 18న వెలగలేరు. గ్రామాల్లో జరుగుతుందని తెలిపారు. వీటిలో పెనుమంట్ర సీహెచ్‌సీ పరిధిలో టీం వన్‌లో వై అనూష, టీం–2లో కె లావణ్య, ఆలమూరు సీహెచ్‌సీ పరిధిలో టీంవన్‌లో డాక్టర్ వి అనిల్‌కుమార్, టీం–2లో కె ప్రదీప్‌కుమార్, మార్టేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో టీం వన్‌లో కె కార్తీక్, టీం–2లో డాక్టర్ ఎస్‌కే ఛావిర్‌లు అందుబాటులో ఉంటారని చెప్పారు.


పెనుమంట్ర ఎంపీడీఓ కార్యాలయంలో వీసీలో పాల్గొన్న ఎంపీడీఓ, వైద్యసిబ్బంది

ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

మొగల్తూరు: సార్వా సాగులో ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ కోరారు. బుధవారం శేరేపాలెం పంచాయతీ నవుడూరుగరువులో ఏర్పాటు చేసిన పొలం బడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాశాఖ అధికారుల సలహాలు తీసుకుని ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. సాగు చేసిన ప్రతీ రైతు ఈ క్రాప్‌లో నమోదు చేయించుకుంటే ప్రభుత్వ పరంగా అందాల్సిన రాయితీలు, పథకాలు వర్తిస్తాయన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలలో తమ సిబ్బంది సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.


పొలం బడిలో మాట్లాడుతున్న ఏఓ రహీమ్

కంటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ఉండి: కంటి సమస్యలపై నిర్లక్ష్యం చేయవద్దని చెరుకువాడ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు(శివయ్య) హెచ్చరించారు. హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉండి మండలం చెరుకువాడలో విజన్ కోఆర్డినేటర్ ఎన్ అర్జున్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా నేత్రవైద్య శిబిరాలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


చెరుకువాడలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

హత్య కేసుతో మహిళకు సంబంధం లేదు

సాక్షి, భీమవరం: కాళ్ల మండలం ఏలూరుపాడులో జరిగిన కరుణమ్మ హత్యకేసులో ముద్దాయి యాళ్ల విజయకుమార్‌కు జీవిత ఖైదు, రూ.500 జరిమానా విధించారని, విజయకుమార్ దొంగిలించిన చెవిదిద్దులను తిరుమాని రాముడు అనే మహిళ స్వాధీనంలో ఉంచుకున్నందుకు ఆమెకు రెండేళ్లు జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించారని న్యాయవాది నెల్సన్‌రాజు తెలిపారు. హత్య కేసులో మహిళకు సంబంధం లేదని చెప్పారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

సాక్షి, భీమవరం: మద్యం సేవించి మానసికంగా, శారీరకంగా హించించడమే గాక అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తోన్న భర్తపై కేసు నమోదు చేసినట్టు భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను చెప్పారు. స్థానిక బుధవారం మార్కెట్ ప్రాంతానికి చెందిన నూర్‌సాహెబ్ (చందు)తో పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన షేక్ రుకియాసుల్తాన్ 2012 వివాహమైంది. వీరికి అబ్బాయి, అమ్మాయి సంతానం. ఇటీవల చందు నిత్యం మద్యం సేవించి తనను వేధిస్తున్నాడంటూ భార్య సుల్తాన ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్టు సీఐ శ్రీను పేర్కొన్నారు.

కొట్టి గాయపరిచారని ఫిర్యాదు

భీమవరం అర్బన్: అన్యాయంగా కొట్టి గాయపరిచిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపూసల మర్రు గ్రామానికి చెందిన బస్వాని నాగ వెంకటేశ్వర్లు అదే గ్రామానికి చెందిన కొల్లు మురళీకృష్ణకు ఇంటి సరిహద్దు విషయంలో గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొల్లు మురళీకృష్ణ అన్యాయంగా తనను కొట్టి గాయపరిచాడని బస్వాని నాగ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు తెలిపారు.

అర్బన్ హెల్త్ సెంటర్ చైర్మన్‌గా పడాల


డీసీసీబీ చైర్మన్ పీవీఎల్‌ను కలిసిన అర్బన్ హెల్త్ సెంటర్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

ఆకివీడు: ఆకివీడు నగర పంచాయతీ అర్బన్ హెల్త్ సెంటర్ చైర్మన్‌గా నగర పంచాయతీ చీఫ్ విప్ పడాల శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును ఆయన బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ పరిధిలో ప్రజలకు వైద్య సదుపాయాలు సక్రమంగా అందేలా కృషి చేస్తానని శ్రీనివాసరెడ్డి తెలిపారు. హెల్త్ సెంటర్ కమిటీ కో చైర్మన్‌గా డీపీఎంఓ సుగుణరాజు, కార్యదర్శిగా మెడికల్ అధికారి వెంకటపతిరాజు, సభ్యులుగా కమిషనర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, మెప్మా అధికారి అనిల్ కుమార్, శానటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారని శ్రీనివాసరెడ్డి వివరించారు.

ఉండి ఏఎంసీ వైస్ చైర్మన్‌గా నరేంద్రరాజు


బాధ్యతలు స్వీకరిస్తున్న నరేంద్రరాజు

పాలకోడేరు: కష్టపడిన కార్యకర్తలకు వైఎస్సార్ సీపీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని డీసీసీబీ చైర్మన్ నరసింహరాజు అన్నారు. ఉండి ఏఎంసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన పార్టీ గొల్లలకోడేరు గ్రామ అధ్యక్షుడు చేకూరి నరేంద్రరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీవీఎల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని, తద్వారా వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తెచ్చుకొనేందుకు కృషి చేయాలని పీవీఎల్ సూచించారు. ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, చింతపల్లి వెంకట నారాయణ, జంగం సూరిబాబు, వైస్ ఎంపీపీలు సోదదాసి నరేష్, ఆదాడ లక్ష్మి తులసి, నాయకులు అవుడు శ్రీనివాస్, గాదిరాజు వీరభద్ర రాజు (బాబు) అప్పలరాజు, గుబ్బల నరసింహారావు, శ్రీను వేణుగోపాలరావు, కుక్కల బాబురావు, నేతల సాల్మన్ సహదేవుడు నాగరాజు, స్వామి తదితరులు నరేంద్రరాజుకు అభినందనలు తెలిపారు.

గాంధీ విగ్రహం శుద్ధి

పాలకొల్లు సెంట్రల్: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా బీజేపీ నాయకులు మహనీయుల విగ్రహాలను పాలతో శుద్ధి చేశారు. బుధవారం స్థానిక బ్రాడీపేట లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాన్ని పాలతో శుద్ధి చేసి పూలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో రావూరి సుధ, జక్కంపూడి కుమార్, కొండ ప్రసాద్, కె. గుప్త, వేరుకొండ దుర్గాప్రసాద్, బైలా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.